www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025

5

ఏలూరు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను ఈ నెల 12న సోమవారం జిల్లాస్థాయితోపాటు మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్ కార్యాలయాలు, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

పిజిఆర్ఎస్ బూటకం..!

'మండల కేంద్రం నిడమర్రులో సర్వే నెంబర్ 240-5a, 5బిలో 34 సెంట్లు తన పేరున ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని మండలాధికారులు అడ్డగోలుగా వేరొకరి పేరున ఆన్‌లైన్ చేసేశారంటూ బాధితుడు జిల్లా కేంద్రంలోని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదును ఆర్‌డిఒకు అప్పగించి పరిష్కరించాల్సి ఉండగా, మళ్లీ మండల తహశీల్దార్‌కు పంపారు. ఆ తహశీల్దార్ అయితే తప్పు చేశారని ఫిర్యాదు చేశారో, అదే అధికారికి ఏవిధంగా పంపిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.'

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో సర్వే నెంబర్ 95-1బి1లో ఉన్న 25 సెంట్ల భూమి తన పేరున ఉండగా, పాస్‌బుక్ కూడా వచ్చిందని, రీసర్వేలో ఖాతా నెంబర్ తప్పుగా నమోదు చేయడంతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసినా తీసుకోవడం లేదని బాధితుడు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఏడాదిన్నరపాటు మండల తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ ఆ ఫిర్యాదు తహశీల్దార్‌కే వెళ్లింది. ఖాతా నెంబర్ తప్పుగా వేయడంతో అది జెసి లాగిన్‌లో మాత్రమే పరిష్కారమవుతుందని తెలిసినా చేయడం లేదు. పిజిఆర్ఎస్ ముగించేసి, వినతి రూపంలో ఇవ్వాలని బాధితునిపై ఒత్తిడి తీసుకొస్తుండటం గమనార్హం.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న బాధితులే కాదు.. పిజిఆర్ఎస్‌లో జనాలు ఇస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికం ఇదే పరిస్థితుల్లో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో 200కుపైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక ఆన్‌లైన్ ఫిర్యాదులూ ఉంటున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారం మరింత ఘోరంగా ఉంటుంది. చాలా మండలాల్లో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూములకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవహారాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. తమ సమస్యలపై మండలంలోని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయిన బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. మండలాధికారి వద్ద సమస్య పరిష్కారం కావడం లేదని బాధితుడు ఫిర్యాదు ఇచ్చినప్పుడు పైఅధికారి లాగిన్‌కు ఫిర్యాదును పంపించాలి. జిల్లా అధికారులు అందుకు విరుద్ధంగా చేస్తున్న పరిస్థితి నెలకొంది. దొంగ చేతికే తాళాలు ఇచ్చిన చందంగా ఏ అధికారి సమస్యను పరిష్కరించకుండా ఇబ్బంది పెట్టారో, అదే అధికారి లాగిన్‌కు పంపిస్తున్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుకు సంబంధించి సమస్యను బట్టి నెలరోజుల నుంచి 90 రోజుల వరకూ గడువు ఉంటుంది. దీంతో నెలలు తరబడి సమస్య పరిష్కారం కాకపోగా, చివర నిముషంలో ఏదోకటి రాసేసి ఫిర్యాదును ముగించేస్తూ ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. చాలామందిని ఆన్‌లైన్‌లో తిరిగి రీఓపెన్ చేయడంపై అవగాహన లేకపోవడంతో మళ్లీ జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేసే మళ్లీ మొదటికి వస్తోంది. దీంతో ప్రజలు ఎన్నో ఆశలతో పిజిఆర్ఎస్‌కు వచ్చి ఇస్తున్న ఫిర్యాదులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. ప్రభుత్వం మాత్రం పిజిఆర్ఎస్‌పై గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జిల్లా కేంద్రంలో పిజిఆర్ఎస్ ఫిర్యాదుల స్వీకరణ నామమాత్రంగా అన్నట్లు సాగిపోతుండటంతో విమర్శలు విన్పిస్తున్నాయి. రెవెన్యూ సమస్యలు కొన్ని ఆర్‌డిఒ, మరికొన్ని జెసి పరిష్కరించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఫిర్యాదులు తహశీల్దార్‌కు వద్దకు వచ్చినా చాలా జిల్లా ఉన్నతాధికారులు లాగిన్‌లో తెలియపరచకుండా ముగించేస్తున్నారు. ఏదైనా సమస్యపై మండల కేంద్రంలో అధికారుల చుట్టూ తిరిగి న్యాయం జరగకపోవడంతో బాధితులు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఆ ఫిర్యాదును మళ్లీ మండలాధికారుల వద్దకు పంపించడం వల్ల ఉపయోగం ఏమిటో అధికారులే చెప్పాలి. పరిష్కరించినట్లు చూపుతున్న పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో చాలా వరకూ బూటకంగా ఉంటున్నాయి. ఉన్నతాధికారుల నుంచి తప్పించుకునేందుకు ఏదోక కారణం రాసి పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ముగింపు పలికేస్తున్న పరిస్థితి ఉంది.

పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్ ఫొటో)

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కరువు

తహశీల్దార్‌పై ఫిర్యాదు చేస్తే మళ్లీ ఆ అధికారి లాగిన్‌లోకే దరఖాస్తు

ఏ శాఖ మండలాధికారిపై ఫిర్యాదు చేస్తే అదే అధికారికి అప్పగింత

దొంగ చేతికి తాళాలు ఇచ్చిన చందంగా వ్యవహారం

నెలలు తరబడి జాప్యం చేసి పరిష్కరించకుండానే మూసివేత

రీఓపెన్‌పై అవగాహన లేక దిక్కుతోచని స్థితిలో జనం

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పరిస్థితి మరింత దారుణం

సమస్యపై చిత్తశుద్ధితో ఉంటేనే న్యాయం

పిజిఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయి. రెవెన్యూ సమస్యలపై బాధితులు జిల్లాలో జరిగే పిజిఆర్ఎస్‌కు వచ్చినప్పుడు ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. అలాకాకుండా ఏదో నామమాత్రం అన్నట్లు వ్యవహరిస్తే ఎప్పటిలా తిరిగినా సమస్యలు పరిష్కారానికి నోచుకోని పరిస్థితి ఉంటుంది. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జనం కోరుకుంటున్నారు.

ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్‌గా గన్ని

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు జాక్‌పాట్ కొట్టారు. ఆప్కాబ్ ఛైర్మన్‌గా, డిసిసిబి ఛైర్మన్‌గానూ గన్నిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా ఉంగుటూరు సీటును త్యాగం చేసిన గన్ని సేవలను అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించడంతో ఆ పార్టీ అభిమానులు, నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు. భీమడోలులోని టిడిపి కార్యాలయంలో గన్నిని కలిసి అభినందించేందుకు నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టడంతో కోలాహలంగా మారింది. 2014 ఎన్నికల్లో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 2019 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో జనసేనకు సీటు త్యాగం చేయాల్సి వచ్చింది. దీనిపై తొలుత కొంత అసంతృప్తి వ్యక్తం చేసినా తర్వాత గన్ని రంగంలోకి దిగి జనసేన అభ్యర్థి, ప్రస్తుత ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు గెలుపు కోసం కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా గన్నికి ఎలాంటి పదవి రాకపోవడంతో ఆయన అనుచరులు నిరాశకు గురయ్యారు. ఈ తరుణంలో రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులు ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్ బాధ్యతలు గన్నికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు భీమడోలు వెళ్లి గన్నిని అభినందించారు. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడుకు చెందిన ముత్యాల రత్నంకు ఆప్కాబ్ ఛైర్మన్ పదవి దక్కింది. ఈసారి ఆ పదవి గన్నిని వరించింది.



గన్ని వీరాంజనేయులను అభినందిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ

నరసాపురానికి మరో పదవి

ప్రజాశక్తి - నరసాపురం

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) నియమితులయ్యారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన యువ వ్యాపారవేత్త చాగంటి మురళీకృష్ణ (చిన్నా) జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి 2014లో పార్టీలో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు నడిపారు. తన వ్యాపారాలు సైతం పక్కన పెట్టి జనసేన బలోపేతానికి నిర్విరామంగా కృషి చేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో నర్సాపురం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సుమారు 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడంలో మురళీకృష్ణ కీలకపాత్ర పోషించారు. కాపు సామాజిక తరగతిలో మంచి పట్టున్న నాయకుడు చిన్నా. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తనదైన శైలిలో పనిచేసి జనసేన అభ్యర్థుల విజయానికి చిన్నా కృషి చేశారు. దీంతో జనసేన రాష్ట్ర కార్యదర్శి పదవిని అధిష్టానం కట్టబెట్టింది. చిన్నా సోదరుడు చాగంటి పార్థసారథి లక్ష్మణేశ్వరం గ్రామ సర్పంచిగా పని చేశారు. తన తండ్రి చాగంటి ఉమానాయుడు ఆశయ సాధన కోసం చాగంటి ఉమానాయుడు ట్రస్టు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డొక్కా సీతమ్మ మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలిని తీర్చారు. ప్రస్తుతం ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చిన్నా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నాను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకీరామ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి నాయుడుతోపాటు కూటమి నేతలు అభినందించారు. డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చిన్నా నియామక వార్త తెలియగానే చాగంటి చిన్నా కార్యాలయం, ఇంటి వద్ద జనసేన కార్యకర్తలు, నాయకులు స్వీట్లు పంచి, కేకులు కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు.

పవన్‌కళ్యాణ్‌కు బొకే అందిస్తున్న చాగంటి మురళీకృష్ణ

అంపశయ్యపై అక్షర గని

నిర్వీర్యమవుతున్న గ్రంథాలయ వ్యవస్థ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రంథాలయాలు జ్ఞాన వ్యాప్తికి, సామాజిక అభివృద్ధికి కేంద్రబిందువులుగా పని చేస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కూడా గ్రంథాలయాలు సమాచార కేంద్రాలుగా, అక్షరాస్యత సాధనలో కీలకపాత్ర పోషించాయి. ఎందరో ఐఎఎస్, ఐపిఎస్, న్యాయమూర్తులు, ఉన్నత స్థాయి అధికారులు ఒకప్పుడు ఈ గ్రంథాలయాల్లోనే చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కాని ఎంతోమందికి జ్ఞానాన్ని అందించి వారి అభ్యున్నతికి, తద్వారా సమాజ పురోభివృద్ధికి తోడ్పడిన గ్రంథాలయాలు నేడు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. పుస్తకాలు కొనలేని దుస్థితిలో, పెచ్చులూడిపోతున్న గోడలతో, ఎప్పుడు కూలిపోయి ఎవరి మీద పడుతుందో తెలియని పైకప్పులతో నేడు గ్రంథాలయాలు హీనస్థితిలో ఉన్నాయి. 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లుగా ఈ దుస్థితికి కారణం ఒక్కరని చెప్పలేం. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత, మేధావుల ప్రశ్నించలేని తత్వం, పాఠకుల నిస్సహాయత ఇలా గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యానికి అనేక కారణాలుగా చెప్పుకోవచ్చు.

పెచ్చులూడి ప్రమాదకంగా ఉన్న గ్రంథాలయ స్లాబ్

ఏలూరులో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయానికి 41 ఏళ్ల చరిత్ర ఉంది. 1984లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన ఈ గ్రంథాలయంలో ఎందరో పేద, బడుగు, బలహీన, మధ్యతరగతి వారు చదువుకుని ఉన్నత స్థాయి అధికారులుగా పనిచేశారు, పనిచేస్తున్నారు. ఈ జిల్లా గ్రంథాలయంతో పాటు జిల్లాలో మరో ఐదు ప్రథమ శ్రేణి, రెండు ద్వితీయ శ్రేణి, 66 తృతీయ శ్రేణి గ్రంథాలయాలు, రెండు గ్రామీణ గ్రంథాలయాలు, 75 పుస్తక పంపిణీ కేంద్రాలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో పని చేస్తున్నాయి. 1,14,482 మంది సభ్యత్వదారులతో, 10,54,432 పుస్తకాలతో ఉన్న ఈ గ్రంథాలయాలు ప్రస్తుతం నిధులు లేక, పాఠకులకు కావాల్సిన పుస్తకాలు అందించలేక, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలు సమకూర్చలేక ఉన్న పుస్తకాలనే చదువుకోమంటూ చేష్టలుడిగి చూస్తున్నాయి. దాతలు ముందుకు రావాలంటూ దీనంగా చేతులు చాస్తున్నాయి.

ఈ దుస్థితికి సెస్సు బకాయిలు కారణం

గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న సెస్సు రూ.కోట్లలో బకాయి పడటం వల్ల గ్రంథాలయాలకు మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడింది. 1960 పౌర గ్రంథాలయ చట్టంలోని సెక్షన్ 20(1) ప్రకారం స్థానిక సంస్థలు వసూలు చేసే ఆస్తిపన్నులో రూపాయికి ఎనిమిది పైసలను గ్రంథాలయ సెస్సుగా వసూలు చేసిన నెల రోజుల్లో జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంది. స్థానిక సంస్థలు ఆస్తిపన్నులు సకాలంలో, సక్రమంగా వసూలు చేసుకుంటున్నప్పటికీ గ్రంథాలయాల సెస్సు సకాలంలో చెల్లించటం లేదు. ఒక్క ఏలూరు నగరపాలక సంస్థ నుంచి సుమారు రూ.11.20 కోట్లు, జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల నుంచి రూ.60 లక్షలు, రెండు నగర పంచాయతీల నుంచి రూ.50 లక్షలు, పంచాయతీల నుంచి రూ.9.50 కోట్లు జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సి ఉంది. గ్రంథాలయ సంస్థ అధికారులు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి అడగగా అడగగా గత డిసెంబర్ రూ.11 కోట్లకు ఏలూరు కార్పొరేషన్ నుంచి కేవలం రూ.20 లక్షలు జమ చేశారు.

ఇక ఏలూరులోని జిల్లా గ్రంథాలయం దుస్థితి చూస్తే మరి దారుణంగా ఉంది. "అనుమతి లేనిదే ఇతరులకు ప్రవేశం లేదు" అనే బోర్డులు గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పెద్దపెద్ద కంపెనీలలోనూ చూసి ఉంటారు. కరోనా తర్వాత "నో మాస్క్ - నో ఎంట్రీ" అనే బోర్డులు ప్రతి చోటా దర్శనం ఇచ్చాయి. కాని జిల్లా గ్రంథాలయం గుమ్మం పక్కన "నో హెల్మెట్ - నో ఎంట్రీ"అనే బోర్డు ఇప్పుడు దర్శనం ఇస్తుంది. అదేంటి? హెల్మెట్ ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు కదా పెట్టుకోవాల్సింది అనే అనుమానం రావచ్చు... కానీ ఇక్కడ పెచ్చులూడిపోయి ఏ క్షణంలో మీద పడుతుందో తెలియని పైకప్పులతో ఉన్న గ్రంథాలయంలో పాఠకుల రక్షణ కోసం ఈ బోర్డు పెట్టారు. అంతేకాకుండా "గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్నది కావున పాఠకులు జాగ్రత్త వహించగలరు" అనే బోర్డు కూడా ఏర్పాటు చేశారు. 41 ఏళ్ల పాటు సేవలందించి ఎంతో మందిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా చేసిన ఈ గ్రంథాలయం ఇంత దీన పరిస్థితిలో ఉండటం బాధాకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో డిఎస్‌సితో పాటు వివిధ ఉద్యోగాల కోసం, పోటీ పరీక్షల కోసం నిత్యం సుమారు 400 మంది ఈ జిల్లా గ్రంథాలయానికి వస్తూ ఉంటారు. కాని పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు లేక రెండు నెలల క్రితం దాతల సహకారంతో రూ.30 వేల విలువైన పుస్తకాలు కొని గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. పౌర గ్రంథాలయ సేకరించి ఇలాంటి నిధులు మంజూరు కావు. వచ్చేది వర్షాకాలం కావడంతో గ్రంథాలయ భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పాఠకులు బిక్కుబిక్కుమంటూ చదువుకోవాల్సిన అవసరం వస్తుంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పోటీ పరీక్షలు, వివిధ ఉద్యోగాల కోసం నిత్యం గ్రంథాలయాలకు వస్తున్న విద్యార్థులు, నిరుద్యోగుల కోసం నిధులు కేటాయించి పుస్తకాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. శిథిలమైపోయిన భవనాన్ని మరమ్మతులు చేయటం లేదా కొత్త భవనానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అప్పటివరకు పాఠకులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మరో భవనంలోకి మార్చాల్సిన అవసరం ఉంది. ఎంతో ఉన్నత చదువులు చదివి జిల్లా ఉన్నతాధికారుల స్థానంలో ఉన్న వారు కూడా ఈ గ్రంథాలయాల పట్ల నిర్లక్ష్యం వహించటం సరికాదని పలువురు బాహటంగానే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నో హెల్మెట్, శిథిలావస్థలో ఉన్నందున జాగ్రత్తలు వహించాలి అని ఏర్పాటు చేసిన బోర్డులు

బకాయిలు చెల్లించాలి

ఎం.శేఖర్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి

ప్రతివారం పంచాయతీ, మున్సిపల్, ఏలూరు కార్పొరేషన్ కార్యాలయాలకు తిరిగి సెస్సు బకాయిలు చెల్లించమని అడుగుతూనే ఉన్నాం. భీమవరంలో స్థానిక సంస్థల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించి సకాలంలో బకాయిలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఫలితం లేదు. బకాయిలు సకాలంలో చెల్లిస్తే గ్రంథాలయాలను మెరుగైన పరిస్థితికి తీసుకురావచ్చు.

నూతన గ్రంథాలయం నిర్మించాలి

శ్రీ నాగాస్త్ర, జిల్లా కన్వీనర్, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక

శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తొలగించి, ఆధునిక వసతులతో, సాహిత్య, సాంస్కృతిక, కళా, విజ్ఞాన రంగాలకు వేదికలుగా ఉంటూ, బాలలకు, మహిళలకు కూడా ఉపయోగపడేలా నూతన గ్రంథాలయాన్ని నిర్మించాలి. వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రస్తుత గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరే పక్కా భవనానికి తరలించాలి. సెస్సును గ్రంథాలయాలకు చెల్లించాలి. దానికోసం ప్రభుత్వం ప్రత్యేక హెడ్‌ను ఏర్పాటు చేయాలి. విద్యార్థులు ఉపాధ్యాయులు, సామాజిక ఉద్యమకారులు, మేధావులంతా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగస్వాములు కావాలి.

ఆర్థికంగా నిలదొక్కుకున్నాక బకాయిలు క్లియర్ చేస్తాం

ఎ.భానుప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

గ్రంథాలయ సంస్థకు ఇటీవల రూ.50 లక్షలు విడుదల చేశాం. మాకు కూడా చాలా శాఖల నుంచి బకాయిలు రావాల్సి ఉంది. మా శాఖ మనుగడ, ఉద్యోగుల జీతాలు కూడా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఆర్థికంగా కొంచెం నిలదొక్కుకున్న తర్వాత మిగిలిన బకాయిలు క్లియర్ చేస్తాం.

ఇడా ఛైర్మన్‌గా వాణివెంకటశివప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గత 20 సంవత్సరాలుగా టిడిపిలో ఉంటున్నారు. ప్రస్తుతం టిడిపి ఏలూరు నగర అధ్యక్షులుగా పని చేస్తున్నారు. బడేటి కుటుంబానికి అత్యంత సన్నిహితులుగా ఉంటూ రాధాకృష్ణ గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఆయనకు ఇడా ఛైర్మన్ పదవి ఇవ్వడంపై పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లంబాడీగూడెంలో తాగునీటి పైపుల లీకేజీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

వెల్లమిల్లి పంచాయతీ పరిధి లంబాడీగూడెంలో తాగునీటి పైపులు పగిలిపోయాయి. లంబాడీగూడెంలో స్థానిక రైతు భూమిని చదును చేసుకుంటున్నారు. దీంతో భారీ వాహనాలు తిరగడం వల్ల భూమి లోపలి పైపులు పగిలిపోయాయి. దీంతో నీళ్ల లీకేజీ ప్రారంభమైంది. దీనిపై స్పందించిన సర్పంచి వస్కా కుమార్‌రాజా పర్యవేక్షణలో ఆదివారం మరమ్మతులు చేయించారు. పివిసి పైపులకు సిమెంటు తూరలు అమర్చి భవిష్యత్తులో సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని సర్పంచి చెప్పారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించామన్నారు.

పగిలిన పైపులకు సిమెంటు తూరలు అమర్చేందుకు జరుగుతున్న పనులు

14 గంటల్లో చోరుల పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

14 గంటల్లో చోరీ కేసును చేధించిన ముదినేపల్లి పోలీసులను జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిగురుకోటకు చెందిన గుబిలి సుబ్బారావు తన భార్యకు అనారోగ్యం కారణంగా ఈ నెల 6న విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆమెను అక్కడి ఆసుపత్రిలో చేర్చి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. అయితే అప్పటికే గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 45 గ్రాముల బంగారు నగలు, 50 గ్రాముల వెండి నగలు అపహరించారు. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో చోరీకి పాల్పడిన చిగురుకోటకు చెందిన పింఢి శ్రీనును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాకచక్యంగా వేగంగా చేధించిన ముదినేపల్లి పోలీస్ కానిస్టేబుళ్లు బి.నాగబాబు, సిహెచ్.లక్ష్మిశ్రీకాంత్, పి.పవన్‌లను ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, ఎస్ఐ విఎస్.వీరభద్రరావు అభినందించారు.

ప్రేమపేరిట నమ్మించి పెళ్లికి నిరాకరణ

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి మృతి

నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఐదేళ్లుగా ప్రేమపేరుతో నమ్మించి తీరా పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యానికి పాల్పడిన యువతి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగర శివారు వెంకటాపురం పంచాయతీ బృందావన్ కాలనీ నాలుగో రోడ్డుకు చెందిన తుంపాల మాధవి (22) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నగరంలోని నల్లదిబ్బకు చెందిన గెడ్డం సంతోష్‌కుమార్ డిగ్రీ పూర్తి చేశారు. సంతోష్ కుమార్ తండ్రి స్థానికంగా ఓ చర్చి నిర్వహిస్తున్నారు. మాధవి చర్చికి వస్తూ ఉండేది. ఈ క్రమంలో సంతోష్‌కుమార్‌తో పరిచయమై ప్రేమగా మారింది. వీరిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సంతోష్‌కుమార్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తాజాగా పెళ్లి ప్రస్తావన తీసుకొస్తే సంతోష్‌కుమార్ ముఖం చాటేయడంతో మాధవి చీమల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు హుటాహుటీన సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది.

నిందితునిపై కేసు నమోదు, అరెస్టు

ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకుడు గెడ్డం సంతోష్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు సంతోష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాధవి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ఏలూరుఅర్బన్: ప్రేమ పేరుతో మోసపోయి ఆత్మహత్యకు పాల్పడిన మాధవి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, పిడిఎస్‌యు, మృతురాలి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. మాధవి మృతికి కారణమైన యువకుడిని, అతని తల్లిదండ్రులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు.

మాధవి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి: ఐద్వా

డిగ్రీ విద్యార్థిని మాధవి ఆత్మహత్యకు కారకులైన గెడ్డం సంతోష్ తల్లిదండ్రులు, మేనమామను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఐ కాలేజీలో డిగ్రీ సెకండియర్ చదువుతున్న తుంపాల మాధవిని గడ్డం సంతోష్ ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో మనోవేదనకు గురైన మాధవి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. ఆత్మహత్యకు కారకులైన గెడ్డం సంతోష్ తల్లిదండ్రులు, మేనమామను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరి వెనుక ఎంతటి వారున్నా కఠినంగా శిక్షించాలని, మాధవి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

కన్నుల పండుగగా చినవెంకన్న కళ్యాణం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన వెంకన్న వైశాఖ మాస తిరు కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా ఆదివారం రాత్రి జరిగింది. శ్రీదేవి భూదేవి సమేతుడైన ఆ శ్రీనివాసుని కళ్యాణాన్ని వీక్షించి భక్త జన సందోహం ఆనంద పారవశ్యంలో మునిగితేలారు. స్వామివారి కళ్యాణ మహోత్సవానికి ఆలయ తూర్పు రాజగోపురం ముందర అనివేటి మండపంలో ప్రత్యేక కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను వేర్వేరు వాహనాల్లో కళ్యాణ మండపానికి తీసుకువెళ్లారు. అక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్ల కళ్యాణమూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించారు. స్వామి అమ్మవార్లకు ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావు, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పట్టు వస్త్రాలు సమర్పించారు. శుభ ముహూర్త సమయాన మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ వేదమంత్రాల సాక్షిగా అర్చకులు జీలకర్ర బెల్లం పూర్తి చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావు, ఇఒ ఎన్‌విఎస్ఎన్.మూర్తి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను, తలంబ్రాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎంఎల్ఎ, ఆలయ ఛైర్మన్

బస్ షెల్టర్‌ను ప్రారంభించిన డిఎస్‌పి వెంకటేశ్వరరావు

సర్వాంగ సుందరంగా నూతన బస్‌షెల్టర్

ప్రారంభించిన పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పోలవరం

సర్వాంగ సుందరంగా పోలవరం పంచాయతీ యడ్లగూడెం గ్రామంలో నిర్మించిన కీర్తిశేషులు పాడం సీతారామయ్య బస్ షెల్టర్‌ను పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పోలవరం పంచాయతీ సర్పంచి పాడం పుష్ప తన భర్త కీర్తిశేషులు పాడం సీతారామయ్య జ్ఞాపకార్థం ఈ బస్‌షెల్టర్ తన సొంత ఖర్చులతో నిర్మించడం హర్షణీయమన్నారు. బస్ షెల్టర్‌లో స్వతంత్ర పోరాట యోధుల చిత్రపటాలు పెట్టడంతో ఈ బస్టాండ్‌లో కూర్చునే ప్రయాణికులకు ప్రశాంత వాతావరణంలో కూర్చున్నట్లుగా ఉంటుందన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచి పాడం పుష్పకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో డిఎస్‌పి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండలాధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ, పంచాయతీ ఉప సర్పంచి కోరిశెట్టి శ్రీను, బోర్డు సభ్యులు, మాజీ ఉప సర్పంచి మంగినకొండ బుజ్జారావు, మురళీకృష్ణ, పాడం శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడాలి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని హక్కును మేడే స్ఫూర్తితో మరోసారి పోరాడి నిలుపుకుంటామని మండలంలో కార్మికులు, ఉద్యోగులు అన్నారు. మేడేను పురస్కరించుకుని మండలంలోని ద్వారకాతిరుమల సిహెచ్.పోతేపల్లి గోద్రెజ్ ఫ్యాక్టరీ వద్ద గోపాలపురం కోకో కోలా ఫ్యాక్టరీ వద్ద మలసానిగూడెం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గొల్లగూడెం తదితర గ్రామాల్లో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, సిఐటియు జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రం ద్వారకాతిరుమలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఇఒ-2 వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. కార్మికుల కష్టానికి తగిన ఫలితం రాకపోవడం వల్లే పేదవాళ్లు మరింత పేదలవుతున్నారని, ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారని విశ్లేషించారు. కార్మికుల కష్టం దక్కే వరకు పోరాటాలని పిలుపునిచ్చారు. కార్మికులు లేనిదే ఉత్పత్తి లేదని, కార్మిక హక్కులు, రక్షణ కోసం మేడే స్ఫూర్తివంతమైన దినోత్సవమన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట భాస్కరరావు మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యత ద్వారా సమ సమాజం సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి, ఆదిలక్ష్మి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బండారు శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మానుకొండ వీర్రాజు, యువజన సంఘం నాయకులు గోలికొండ నాగరాజు, సిఐటియు నాయకులు మధు, వెంకన్న, అన్నవరం, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎస్ఐ వీరభద్రరావు, అంబుల వైష్ణవి, మనోజ్ తదితరులు

వీర జవాన్లకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

భారత్ - పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంలో ఉగ్రమూకలకు సరైన గుణపాఠం చెబుతున్న మన వీరజవాన్లకు మద్దతుగా ముదినేపల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని ప్రధాన సెంటర్లలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీర జవాన్లకు జోహార్ వీర జవాన్లకు జై జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు, ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్, ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, బలుసు రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న మహిళలు

అమ్మ సేవలను వెలకట్టలేం

వెలుగు కార్యాలయంలో మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అమ్మ సేవలను వెలకట్టలేమని వెలుగు ఎపిఎం ఎన్.ఝాన్సీ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా వెలుగు కార్యాలయంలో మాతృ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలను సన్మార్గంలో నడిపేందుకు శ్రమిస్తారన్నారు. ప్రతి మహిళా తన కుటుంబంతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి అరుణ, మండలంలోని విఒఎలు, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న జాకీర్ హుస్సేన్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాణా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని బండివారిగూడెంలో రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సుంకర నారాయణ మూర్తి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాణా వెల్ఫేర్ సొసైటీ జాతీయ అధ్యక్షులు సుంకర సాంబ శివ రాయల్ ఆశయాలకు అనుగుణంగా మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం తప్పనిసరని సూచించారు. రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అత్యుత్తమ ఫలితాలు 'శశి'కే సాధ్యం

హైస్కూల్ కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు


కరస్పాండెంట్ సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - కలిదిండి

అత్యుత్తమ ఫలితాల సాధన స్థానిక శశి హైస్కూల్‌కే సాధ్యమని కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అంకిత భావం, అత్యంత అనుభవంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, దేశభక్తి, మానవత్వం, ఆత్మస్థైర్యం పెంపొందే విధంగా తీర్చిదిద్దడమే శశి హైస్కూల్ లక్ష్యమన్నారు. దేశంలో ప్రముఖ సంస్థ లీడ్ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఐఐటి ఫౌండేషన్ కోర్సు జరుగుతోందన్నారు. క్లిష్టమైన విషయాలను సులభంగా బోధించే డిజిటల్ ల్యాబ్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం లైబ్రరీ సదుపాయం కల్పించామన్నారు. చదువుతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ, ఆసక్తి గల విద్యార్థులకు క్లాసికల్, వెస్టర్న్ డ్యాన్స్‌లలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. విజ్ఞాన యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. తమ విద్యార్థులు జాతీయ కరాటే టోర్నమెంట్‌లో పలుమార్లు పతకాలు సాధించారని చెప్పారు. కబడ్డీ, కోకో పోటీల్లో జిల్లా స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించారన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 2022లో పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థి కెఎల్ఎన్.స్రవంతి సాధించిన 587 మార్కుల రికార్డు మండలంలో నేటికీ చెక్కు చెదరలేదని, ఇది శశి హైస్కూల్‌కే గర్వకారణమని తెలిపారు. 2024-25 ఫలితాల్లో సైతం 500పైగా మార్కులు 16 మంది విద్యార్థులు కైవసం చేసుకుని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. భీమవరం డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. వరద బాధితుల సహాయార్థం రూ.60 వేల చెక్కును తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణకు అందించినట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పిస్తున్నామన్నారు. ఎస్ఎస్‌సి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించేలా సన్మానించి, నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. సుదూర ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం ఉందన్నారు. విద్యలోనే కాకుండా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నందున శశి హైస్కూల్‌లో తమ పిల్లలను చేర్చి, వారి బంగారు భవితకు బాటలు వేయాలని కోరారు.


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక వర్గాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు నూజివీడు సిఐటియు కార్యాలయంలో ఎన్ఆర్.హనుమాన్లు అధ్యక్షతన సిఐటియు విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాన్ని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు అనుకూల విధానాన్ని అమలు చేయాలని చూస్తుందన్నారు. అదే సందర్భంలో ఈ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రయివేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేంద్ర, నాగూర్, రంగారావు, నాగరాజు, నరేష్, స్టాలిన్, శ్రీనివాసరావు, ఎకెడి.ప్రసాద్, ఏసు, రమేష్, ఆదిలక్ష్మి, నాగమణి, రజిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో...

ఉపాధి కూలీలకు కరపత్రాల పంపిణీ

ఆగిరిపల్లి :ఉపాధి హామీ కూలీలకు రూ.600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలీలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, దొంగ మస్తర్లు, ఆన్‌లైన్ పద్ధతి రద్దు చేయాలని, క్షేత్రస్థాయిలో సిబ్బందిపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, తదితర డిమాండ్స్‌తో ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందామనే నినాదంతో ఈ నెల 20న నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చిన్నాగిరిపల్లి, ఈదులగూడెం, కలటూరు, చొప్పరమెట్ల గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పని ప్రదేశాలను పరిశీలించి కూలీలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారావు, అర్జునరావు, మరియమ్మ, నాగేశ్వరమ్మ, తాతారావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి

జిల్లావ్యాప్తంగా పోలీసుల ముమ్మర తనిఖీలు

ఏలూరు స్పోర్ట్స్ : బస్టాండ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలు పటిష్టపరిచేందుకే ఈ తనిఖీలు చేపడుతున్నామని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సంబంధిత డిఎస్‌పిల ఆధ్వర్యంలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఎస్ఐలు జిల్లా వ్యాప్తంగా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస్టాండ్లలో, రైల్వేస్టేషన్లలో, హోటళ్లల్లో, లాడ్జిల్లో, కూడలి ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బస్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో లగేజ్ రూములు, బుకింగ్ కౌంటర్లతో సహా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోకి ఎవరూ అక్రమంగా చొరబడకుండా, వారు నగరాల్లో, పట్టణాల్లో ఆశ్రయం పొందకుండా ఉండేందుకు ఈ తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అసాంఘిక శక్తులను రూపుమాపేందుకు మాత్రమే ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల ఎస్ఐలు, సిఐలు, డిఎస్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో పోలీసు సిబ్బంది ఆదివారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం, మాదకద్రవ్యాల సరఫరా అరికట్టే దిశగా తనిఖీలు చేపట్టారు. ప్రతి పార్సిల్‌ను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపామన్నారు. అనుమతులు లేకుండా మద్యాన్ని అక్రమంగా సరఫరా చేయడం, విక్రయించడం నేరమన్నారు. ఇలాంటివి ఏమైనా ఉంటే తక్షణమే తమకు సమాచారం అందించాలని సూచించారు.

వినోదంగా వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు 11వ రోజు ఆదివారం సందడిగా, వినోదంగా కొనసాగాయి. ముందుగా విద్యార్థులతో గ్రంథాలయ సిబ్బంది కథలు చదివించడం, కథల్లోని నీతిని వివరించడం, చదవడం మాకిష్టం కార్యక్రమాలు చేయించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ విద్యార్థులకు దేశ స్వాతంత్ర్య సమర యోధులు జీవిత విశేషాలపై జనరల్ నాలెడ్జ్, క్విజ్ పోటీలు, సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, సులభంగా వేద గణితం నేర్చుకోవడం ఎలా అనే విషయాలపై క్లుప్తంగా శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎస్.మహీధర్ రిసోర్స్‌పర్సన్ విద్యార్థులకు మైండ్ మెమరీ గేమ్స్, సరదా ఆటలు ఆడించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు.

ఏలూరులో...

అనంతరం ఈ శిక్షణ తరగతులను ఉద్దేశించి డిప్యూటీ లైబ్రేరియన్ మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపు ముఖ్య ఉద్దేశం వివరించారు. విద్యార్థుల్లో పఠనాశక్తిని వెలికి తీసేందుకు, వారిలో దాగి ఉండే ప్రతిభను గుర్తించడం కోసమే ఈ వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో కథలు, కథనాలు, నృత్యాలు, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, క్విజ్, సృజనాత్మక కృత్యాలు, కాగితంతో బొమ్మల తయారీ, పేపర్ ఆర్ట్, పెయింటింగ్ చిత్రాలు, శిక్షణ ఇచ్చేందుకు రిసోర్స్ పర్సన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బి.రమేష్, ఎమ్‌డి అస్లాం పాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో 13వ రోజుకు చేరాయి. ఈ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పొడుపు కథలు, స్టోరీ టెల్లింగ్ చెప్పించారు. అనంతరం ఇండోర్ గేమ్స్ ఆటలు ఆడించారు. 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాసవి అవార్డ్స్ 2025 కార్యక్రమాన్ని ఏలూరులోని పెరుగుచెట్టు వద్ద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, మాజీ ఎంఎల్ఎ అంబికా కృష్ణ, హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి చేతుల మీదగా విద్యార్థులకు స్కాలర్‌షిప్, స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ ప్రదానం చేశారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు జై బాబు ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందించడం అభినందనీయమన్నారు. రాజకీయం అనేది ముళ్ల పొద వంటిదని, రాజకీయాల్లో మాట పడడానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి 6600 ఇళ్లకు 2200 మంజూరయ్యాయన్నారు. ఇల్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే రూ.25 లక్షలతో ఇల్లు కట్టించి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మెడికల్ క్యాంపులు నిర్వహించడమే కాకుండా, కేన్సర్ బాధితులకు ఆర్థికంగా భరోసా కల్పించాలని కోరారు. ఆర్యవైశ్యులు కోరిన రోడ్డు సమస్యను కూడా తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 350 మందికి రూ.రెండు లక్షలకు పైగా ఖర్చు చేసిన స్కాలర్‌షిప్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ స్కాలర్‌షిప్స్ తీసుకున్నవారు ఉన్నత స్థానాలకు ఎదిగి ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో చేయాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గుర్రం సత్యనారాయణ, అధ్యక్షుడు దివ్వెల జై బాబు, ప్రధాన కార్యదర్శి పూర రామకృష్ణారావు, కోశాధికారి నరసింహారావు, తవ్వా అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణా జరగకుండా చూడాలి

విఆర్‌ఒలకు తహశీల్దార్ బద్రు ఆదేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా జరగకుండా చూడాలని ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు ఆదేశించినట్లు తహశీల్దార్ బి.బద్రు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని సుంకొల్లు గ్రామంలో ఉన్న చెరువులో మట్టి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం అందిన వెంటనే సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని చెరువు దగ్గరికి పంపించామని తెలిపారు. అక్కడ మట్టి అక్రమ రవాణాను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వెంటనే మట్టి అక్రమ మట్టి రవాణా నిలిపివేసినట్లు తెలిపారు. మట్టి అక్రమ రవాణా చేయకుండా సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు పర్యవక్షణ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ట్రాఫిక్‌కు ఆటంకంగా ప్రచార బోర్డులు

తొలగించాలని ప్రజల వేడుకోలు

ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న ప్రచార బోర్డులు

ప్రజాశక్తి - కలిదిండి

ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న ఆర్చ్ ఆకారంలో ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. గడిచిన శివరాత్రి సందర్భంగా ఆర్చ్ ఆకారంలోని ప్రచార బోర్డులను ప్రధాన సెంటర్‌లో ఆలయానికి వెళ్లే దారిలో రాష్ట్రీయ రహదారిపై ప్రతి ఏటా ఏర్పాటు చేయడం పరిపాటి. వాటిని 16 రోజుల అనంతరం తొలగిస్తారు. కాని ఈ ఏడాది వాటిని అలాగే వదిలేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా వాటిని అలానే వదిలేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టి, నిరుపయోగంగా ఉన్న వాటిని తొలగించాలని కోరుతున్నారు.

ఆప్కాబ్ ఛైర్మన్‌గా గన్ని నియామకం హర్షణీయం

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులును ఆప్కాబ్ ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎగా వ్యవహరించిన గన్ని వీరాంజనేయులు గత ఎన్నికల్లో మరోసారి పోటీ చేయాలని భావించగా, కూటమి పొత్తులో భాగంగా ఉంగుటూరు సీటు త్యాగం చేసినందుకు ఆప్కాబ్ ఛైర్మన్ పదవి ద్వారా అధినాయకత్వం సముచిత స్థానం కల్పించిందని తెలిపారు. గన్ని వీరాంజనేయులుకు కీలక పదవి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనతో పాటు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కూటమి ఎంఎల్ఎ అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన గన్ని వీరాంజనేయులు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని తెలిపారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేసిన గన్ని వీరాంజనేయులుకు పదవుల కేటాయింపులో తగిన ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. గన్ని వీరాంజనేయులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని తెలిపారు. ఆప్కాబ్ ఛైర్మన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులుకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు.

కుక్కునూరు మండలాధ్యక్షుని హర్షం

కుక్కునూరు :కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన కార్పొరేషన్ ఛైర్మన్ జాబితాలో జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు ఆప్కాబ్ ఛైర్మన్, ఏలూరు డిసిసిబి ఛైర్మన్‌గా చోటు దక్కడం హర్షణీయమని టిడిపి కుక్కునూరు మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ గన్ని వీరాంజనేయులు అటు ప్రజా సమస్యల పరిష్కారానికి, ఇటు పార్టీ కార్యకర్తల పట్ల సమర్థవంతంగా అంకితభావంతో పని చేశారన్నారు. జిల్లాలో టిడిపి బలోపేతానికి ఎనలేని కృషి చేశారన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించారన్నారు. గన్ని వీరాంజనేయులు భవిష్యత్తులో అత్యున్నత పదవులు అధిరోహిస్తారని ఆకాంక్షించారు.

IN THE COURT OF 7th ADDITIONAL DISTRICT JUDGE, ELURU

E.P.NO.17/2024, O.S.NO.59/2016

Between:
Bala Veera Venkata Satyanarayana ...Decree-Holder
And
Jupalli Seetharama Rao & Co And others ...Judgement-Debtors

NOTICE

JDR.No.7: Smt. Jupalli Venkata Swathi, Priyadarshini, D/o Late Seetharama Rao, Business, D.No.45-B, Allasani Peddanna Veedhi, Ashok Nagar, Eluru, EJCJ.
JDR.No.8 : Jupalli Satya Rajiv, S/o late Seetharama Rao, Business, D.No.45-B, Allasani Peddanna Veedhi, Ashok Nagar, Eluru. EJCJ.

Whereas the Decree-Holder filed E.P. for sale of E.P. Schedule property for recovery of the Decree debt against Judgement-debtors. The Honourable court order notice to Judgement-debtor under order 21 Rule 22 C.P.C. in the above Execution petition. Whereas as the notice addressed to the Judgement-debtor in the above Execution petition could not be served as last known address and the notice could not be served; Whereas the Honorable court ordered notice to Judgement-debtor by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on 18.06.2025 at 10.30 A.M and state your objections if any. Lest the Execution petition will be decided ex-parte.
(As per court orders)

DEVULAPALLI SREE RAM
Eluru **DEVULAPALLI KRISHNA SASTRY**
Dt.12.05.2025. Eluru, Advocates

IN THE COURT OF THE 7 th ADDITIONAL DISTRICT JUDGE ELURU

A.S.NO.30/2024

Between:
Mulpuru Srikrishna Vasudeva Vara Prasada Rao. **....APPELLANT**
Vs
Vegunta Dhanalakshmi & others **...RESPONDENTS**

NOTICE

2. Vegunta Srinivassa Rao,
Son of Late Vegunta Purnachandra Rao, Employee, D.N.1-26, H/o Appannaveedu Village. Appannaveedu Grampanchayat, Pedapadu Mandal.
3. Vegunta Niranjana Rao
Son of Late Vegunta Purnachandra Rao, Employee, D.N.1-26, H/o Appannaveedu Village. Appannaveedu Grampanchayat, Pedapadu Mandal.

Whereas the Appellant filed appeal against the order and Decree dated 28-02-2022 passed in I.P.No.13/2015 on the file of Additional Senior civil Judge, Eluru. The Honourable court order notice in the above Appeal to the Respondents 2 to 4.

Whereas as the notice addressed to the Respondents 2 to 4 in the above Appeal could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to the Respondents 2 to 4 by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person or through Advocate before this Honourable court Eluru **on 23..06..2025 at 10.30 A.M.** and state your objections if any. Lest the petition will be decided ex-parte.

(As per court orders)

DEVULAPALLI SREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru, Advocates,
Dt.: 11..05..2025. Eluru